## సారథులొచ్చారు..

మహబూబ్‌నగర్,అక్టోబర్12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు సం బంధించి బీఆ ర్ఎస్ పార్టీ నియోజకవర్గాల వారీ గా ఎన్నికల ప్రచార కమిటీ ఇన్‌చార్జీలను నియమించింది. మక్తల్ నియోజకవర్గానికి శాట్ చైర్మ న్ ఆంజనేయ గౌడ్, అలంపూర్‌కు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అచ్చంపేటకు మైనార్టీ కార్పొ రేషన్ చైర్మన్ ఇంతి యాజ్‌ఇసాక్, గద్వాలకు రాకేష్ చిరుముల్ల, కల్వకు ర్తికి ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని కేటా యించింది. వీ రంతా అభ్యర్థుల ఎన్నికల ప్రచార సరళిని పర్యవేక్షించనున్నారు.

- మొత్తం 30,53,863 మంది ఓటర్లు
- పెరిగిన ఓటర్లు.. వనపర్తిలో అత్యధికంగా..
- ఐదేండ్లలో పెరిగిన సంఖ్య 93 వేలు
- గతానికిమించి పోలింగ్ బూత్‌లు
- ఫలితమిచ్చిన ఓటరు నమోదు కార్యక్రమం
- ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లాలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- సరిహద్దులో నిఘా ముమ్మరం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల బిజీ

# ఆమెదే పైచేయి



## ఉమ్మడి జిల్లాలో 15,28,661 మహిళా ఓటర్లు

## ఎన్నికలకు సన్నద్ధత

- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- కోడ్‌పై పార్టీలకు అవగాహన
- బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు
- ఫిర్యాదులపై తక్షణ చర్యలకు ఏర్పాట్లు
- పకడ్బందీగా నిర్వహణకు కార్యాచరణ
- ఇకపై ఎన్నికల అధికారులచే పర్యవేక్షణ

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికారులు తలమునకలయ్యారు. ఈనెల 9వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించే కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఓటింగ్ నమోదు ప్రక్రియ పూర్తికాగా కొత్త ఓటర్లను చేర్పించే ప్రక్రియనూ యథావిధిగా కొనసాగించనున్నారు. ఇప్పటికే బీఎల్‌వోలకు దిశానిర్దేశనం చేయడం జరిగింది. ఇక కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించేలా ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఆయా పార్టీలు ప్రచారం చేసుకోవడం, అనుమతులు తీసుకోవడం, సమస్యలపై ఎలా ఫిర్యాదులు చేయాలి, సభలు నిర్వహించుకోవడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల నామినేషన్ నుంచి ప్రచారం వరకు రాజకీయ పార్టీలు కోడ్ అమలు చేస్తే ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉంచేలా ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా వివరించే చర్యలు చేపట్టడం గమనార్హం. ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తికాగా టాయిలెట్లు, విద్యుత్, తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేదుకు మరింత గట్టి చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విషయమై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో అంతర్‌రాష్ట్ర, అంతర్‌జిల్లా, నియోజకవర్గస్థాయిలో చెక్‌పోస్టుల్లో 24గంటల పాటూ తనిఖీలు కొనసాగించనున్నారు. రూ.50వేలు దాటితే, ఆన్‌లైన్‌లో రూ.లక్ష వ్యవహారాలపై నిఘా ఉంచనున్నారు. ఈ లావాదేవీలపై తమకు వివరాలు అందించాలని కలెక్టర్ ఇప్పటికే బ్యాంకర్లను సైతం ఆదేశించారు. ఇక చెక్‌పోస్టుల్లో పట్టుబడ్డ నగదు, బంగారంపై తగిన ఆధారాలు చూపిస్తే తిరిగి అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మద్యం కూడా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటుగా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా సూచించారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల్లోపు జిల్లా ఎన్నికల అధికారులకు ఆయా రోజుల్లో జరిగిన వివరాలపై పూర్తిస్థాయిలో నివేదికలు అందించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఫ్లయింగ్ స్క్వాడ్లు, వీడియో సర్వేలైన్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, మానిటరింగ్ కమిటీల నియామకాలను కూడా పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలులో వచ్చే ఫిర్యాదులు, ఆయా పార్టీలకు ఇచ్చే అనుమతులపై పారదర్శకంగా వ్యవహరించేలా ఆదేశించడం జరిగింది. ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో 24గంటల పాటు అమలులో ఉండేలా కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక 80 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్లు ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేయడంతో బీఎల్‌వోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అలాగే యువకులకు, మహిళలకు మోడల్ పోలింగ్ స్టేషన్లనూ ఏర్పాటు చేయనున్నారు. కోడ్ అమలులోకి వచ్చిన రోజునుంచే గ్రామాలు, పట్టణాల్లో ఆయా రాజకీయ పార్టీలు, నాయకుల పేరుతో వెలిసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు తొలగించడంతోపాటు వాల్ రైటింగ్స్‌ను కూడా పూర్తిగా తుడి వేయడం, వాటిని సున్నాలు వేయడం లాంటివి చేయిస్తున్నారు. ఎలాంటి సమావేశాలు జరుపుకోవాలనుకున్నా అనుమతులు తప్పనిసరిగా చేయడం జరిగింది. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతం గా నిర్వ హించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా ఎన్నికల అధి కారులు చర్యలు వేగవంతం చేయడం విశేషం.



పార్టీల రాతలు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

### పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు



జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నాం. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆయా పార్టీలకు నిబంధనలపై వివరించడం జరిగింది. చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. నగదు, బంగారం, మద్యం రవాణాలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనల అమలులో అధికారులకు సహకరించాలి. ఎలాంటి సమావేశాలకైనా అనుమతులు తీసుకోవాలి. ఎన్నికల నిర్వహణలో పారదర్శకంగా చర్యలు తీసుకొనేలా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఇంకా కొత్త ఓటర్లు ఉంటే పేర్లు నమోదు చేసుకొనే అవకాశం కల్పించాం.

–ఉదయ్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల షెడ్యూల్ వెలువడ గానే ఎలక్షన్ సందడి ప్రారంభమైంది. నవంబర్ 30న పోలింగ్ జరుగనుండటంతో అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో వచ్చే వాహనాలను తనిఖీలు చేసి మద్యం రవాణా, నగదు తీసుకెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మరోవైపు ఎన్నికలకు ఇంకా 48 రోజుల సమయం ఉండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లు, సిబ్బందిని పురమాయించే పనిలో పడ్డారు. ఓటర్ల నమోదు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం.. క్షేత్రస్థాయిలో అధికారులు దగ్గరుండి ఓటర్లను నమోదు చేయించడంతో విశేష స్పందన లభించింది. గత ఎన్నికలతో పోలిస్తే ఏకంగా లక్ష వరకు కొత్త ఓటర్లను నమోదు చేయించారు. ఓటర్ల నమోదే కాకుండా ఈవీఎంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఓటుపై ఆసక్తి పెరిగింది. ఈసారి చాలామంది యువత, విద్యార్థులు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్న వారిలో ఉన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కాలేజీల వద్ద కూడా ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఓటర్ల నమోదుకు ఊహించని ఆదరణ లభించింది.

### పెరిగిన ఓటర్లు

తాజాగా ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితా ప్రకారం 30 లక్షల 53 వేల 863 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 15,25,132 కాగా, మహిళలు 15,28,661, ట్రాన్స్‌జెండర్లు 69 మంది ఉన్నారు. 2023 ఎన్నికలకు సంబంధించిన తుది జాబితా ఫైనల్ కావడంతో ఎన్నికల కమిషన్ జాబితా ప్రకటించింది. ఐదేండ్లలో పోలిస్తే సుమారు కొత్త ఓటర్ల సంఖ్య 93 వేల వరకు పెరిగింది. 18 ఏండ్లు నిండిన వారంతా ఓటర్లుగా కొత్తగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో వనపర్తి నియెజకవర్గంలో అన్ని నియోజకవర్గాల కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 2,65,622 మంది ఓటర్లున్నారు. జడ్చర్లలో 2,12,395 మంది ఓటర్లు ఉండగా మిగితా నియోజకవర్గాలతో పోలిస్తే తక్కువ ఓటర్లు ఇక్కడ ఉన్నారు. గత ఎన్నికల్లో చాలాచోట్ల పోలింగ్ బూతుల సమస్య ఏర్పడింది. ఈసారి ప్రజలకు అవసరం ఉన్న ప్రాంతాల్లో ఓటర్ల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు సరిగ్గా 48 రోజుల సమయం ఉన్నది. ఈమేరకు ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల నియమావళిని ఆయా పార్టీ ప్రతినిధులకు కలెక్టర్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ బృందాలు అప్పుడే చెకింగ్‌లు ప్రారంభించాయి. భారీగా నగదు పట్టుబడుతుంది. మద్యంపై కూడ నిఘా పెంచారు.

### పెరిగిన ఓటర్లు పొలింగ్ కేంద్రాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 13 నియెజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే భారీగా పెరిగింది. కొత్తగా ఓటేసే వారి సంఖ్య 93 వేలకుపైగానే ఉన్నది. గతంతో ఎన్నడూ లేనంతగా ఓటర్ల నమోదు ప్రక్రియ సాగింది. యువతలో చైతన్యం పెరగడం.. చదువుకున్న వారంత ఓట్లు వేయడానికి ఆసక్తి చూపడంతో గణనీయంగా ఈసారి కొత్త ఓటర్లు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో, మండలాలు, జిల్లా కేంద్రాల్లో ఓటర్లను చైతన్యం చేసేందుకు చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని అంటున్నారు. అంతేకాక గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ మిషన్లపై కూడా పూర్తి స్థాయి అవగాహన కల్పించడంతో ఓటర్ల సంఖ్య పెరిగిందన్నారు. కొత్తగా ఓటు వేసేందుకు చాలామంది అసక్తి చూపుతూ ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లోకి వెళ్లి దరఖాస్తులు కూడ సమర్పించారు. గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈవీఎం మిషన్ ఎలా పనిచేస్తుందో చూపించారు. డమ్మీ ఈవీఎం మిషన్‌ను ఉంచి బటన్ ప్రెస్ చేయగానే వీవీప్యాట్‌లో కనిపించే గుర్తును చూపెట్టారు. అనేక అవగాన కార్యక్రమాలు చేపట్టడంతో ఈసారి ఓట్ల శాతం పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

### రూ.50 వేలకంటే మించిన నగదుపై నిఘా..

ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద భారీగా నగదు పట్టుబడుతుంది. ఈ నగదును ట్రెజరీకి తరలిస్తున్నారు. వనపర్తి జిల్లాలో తనిఖీల్లో భాగంగా రూ.14లక్షల 20 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 150 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. మక్తల్ మండలం కాచ్‌వార్ వద్ద వాహనాల తనిఖీల్లో రూ.లక్షా 40 వేలు పట్టుబడింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో అధికారులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో గ ట్టినిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల కృష్ణా చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి వస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం అక్రమ రవాణా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిపై నిఘా ఉంచామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు. ఏపీ, తెలంగాణ సరిహద్దులో నిఘా ఉంచామని.. అయితే అలంపూర్ బ్రిడ్జిపై నుంచి మద్యం తరలిస్తున్నారనే సమాచారం ఉండటంతో అక్కడ కూడా నిఘా పెంచామన్నారు.

### రాతలను తుడుస్తున్న సిబ్బంది..

ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేయడానికి ఆయా పార్టీల నాయకులు భారీగా వాల్‌రైటింగ్ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో రావడంతో ఈ రాతలన్నింటినీ తుడిచి వేస్తున్నారు. వేల రుపాయలు ఖర్చు చేసి తమ రాయించుకున్న వాటిని సిబ్బంది తొలగిస్తుండటంతో నేతలు మదనపడ్తున్నారు. చాలామంది టికెట్లు కోసం అధిష్టానం దృష్టిలో పడేందుకు వేలకు వేలు ఖర్చుచేసి గోడల మీద వాల్‌రైటింగ్ చేయించారు. చివరకు ఎన్నికల నియమావళి రావడంతో ఈ రాతలన్నింటినీ చెరిపేస్తున్నారు. గ్రామాల్లో జెండాలు, ముఖ్య నేతల విగ్రహాలకు కూడా మాస్కులు వేస్తున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో గ్రామాల్లో, జిల్లా కేంద్రాల్లో చాలామంది ప్రత్యర్థులపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమంటూ వస్తున్న ఫిర్యాదులపై కలెక్టర్లు స్పందించి వెంటనే విచారణ జరిపిస్తున్నారు. ఫిర్యాదులు నిజమైతే చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంపైన ఎన్నికల వేడి పెరుగుతుండటంతో గ్రామాల్లో పార్టీలపై చర్చలు మొదలయ్యాయి. ఫలానా వ్యక్తి గెలుస్తాడని.. ఓట్లు పడ్తాయని ప్రచారం జరుగుతుంది. అన్ని పార్టీలు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

## పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం

- సీ-విజిల్ యాప్‌ను రూపొందించిన ఈసీ
- యాప్ ఆధునీకరణ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం
- ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు
- నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం

ఖిల్లా ఘణపురం, అక్టోబర్ 12 : ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొం దించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం మారింది. ప్రస్తుతం ఈ యాప్ ఆధునీకరణతో పాటు ఫ్రేయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేసింది. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100నిమిషాల వ్యవధిలో దర్యా ప్తు చేసిన ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితోపాటు నియోజక వర్గపరిధిలోని ఫ్రేయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించినా, రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులు వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురిచేసినా ఈ వివరాలను నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్ వాడడం, ఇతర నిబంధనలు ఉల్లఘించినా, కుల, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన తర్వాత 10నిమిషాలలో ఎన్నికల నిర్వహిస్తున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు.

### యాప్‌తో నేరుగా ఫిర్యాదు

స్మార్ట్ ఫోన్లలో సీ-విజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి కోడ్ ఉల్లంఘనలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. స్మార్ట్ ఫోన్లలోని ప్లే స్టోర్‌లో సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అనంతరం భాషను ఎంపిక చేసుకొని టిక్ చేయమని సూచిస్తుంది. అనంతరం ఈ యాప్ మీ స్మార్ట్ ఫోన్‌లో స్క్రీన్‌పై దర్శనమిస్తుంది. అ తర్వాత సెల్‌ఫోన్ నెంబర్ ఎంటర్ చేయమని సూచిస్తుంది. సంబంధిత సెల్ నెంబర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆఫ్ ఇండియా నుంచి ఎస్ఎంఎస్ ద్వారా 4 అంకెలతో కూడిన నెంబర్ వస్తుంది. ఈ నెంబర్‌ను సెల్ ఫోన్లలో ఎంటర్‌చేసిన అనంతరం వినియోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపర్చబడుతాయి. అనంతరం మీ ఫోన్‌లో యాప్ ఓపెన్ అవుతుంది. మీ పరిధిలోని కోడ్ ఉల్లంఘనపై ఫొటో లేదా వీడియోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఫిర్యాదు అందిన తర్వాత 10నిమిషాల్లో ఎన్నికల అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు.







### నిబంధనలు ఉల్లంఘిస్తే యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు



ఎన్నికల నియమ నిబంధనలు ఏ రాజకీయ పార్టీ లు అయినా ఉల్లంఘిస్తే యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. విషయం ఎన్నికల అధికారులకు సమాచారం అందిన 10 నిమిషాల్లో ఘటనా స్థలాని కి చేరుకొనే విధంగా మండల స్థాయి ఫ్లేయింగ్ అధికారులకు సమచారం అందజేస్తారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు.

–పాండు తాసీల్దార్, ఖిల్లాఘణపురం

## విద్యకు ఆదిదేవుడు.. హయగ్రీవస్వామి

- స్వయంభూవుగా వెలసిన స్వామివారు
- 400ఏండ్ల చరిత్ర కలిగిన ఆలయం
- లక్ష్మీసమేత విష్ణుమూర్తి అవతారం
- కోరిన కోరికలు తీర్చే దైవంగా భక్తుల నమ్మకం

గద్వాల టౌన్, అక్టోబర్ 12 : గద్వాల సంస్థానాదీశుల పాలనలో సాహితీ సేవకు.. కళలకు పెద్దపీట వేశారు. వారి పాలనలో శ్రీభూ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు ఎన్నో ఆలయాలు నిర్మించబడ్డాయి. స్వయంగా నాటి పాలకులకు చెన్నకేశవస్వామి.. హయగ్రీవ స్వామిలు ప్రత్యక్షమయ్యారన్న కథలు ఇప్పటికీ ప్రజలు చెప్పుకుంటారు. అంతటి భక్తి కలిగిన సంస్థానాదీశులు ఎన్నో ఆలయాలకు శ్రీకారం చుట్టి నిత్యపూజలు చేశారు. అందులో ఒకటి శ్రీహయగ్రీవ స్వామి ఆలయం. స్వయంభూవుగా వెలసిన స్వామి వారు నేటికి భక్తుల నుంచి అఖండ పూజలు అందుకుంటున్నాడు. జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో గల శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో పడమటి వైపు ఉంటుంది. ఆలయాన్ని దాదాపు 400 సంవత్సరాల కిందట సంస్థానాదీశుల వంశస్తుల పాలనలో నిర్మించినట్లుగా తెలుస్తున్నది. సంతాన వేణుగోపాల స్వామి ఆలయానికి ముందే హయగ్రీవ స్వామి ఆలయం నిర్మాణం జరిగిందని ఆక్కడి ఆర్చకులు చెబుతున్నారు.

### ఆలయ నిర్మాణం...

ఆలయాన్ని సంస్థానంలో 6వ తరానికి చెందిన రాజా సీతారాం భూపాల్ తల్లిదండ్రులు భీంరెడ్డి, లక్ష్మీనాంచారమ్మలు నిర్మించినట్లు చరిత్ర చెబుతున్నది. గద్వాల సంస్థానం ఏర్పాటు సమయంలో చేపట్టిన కోట నిర్మాణంలో ఒక బ్రాహ్మణుడుని బలిచ్చారని చరిత్ర చెబుతుంది. అందుకు ఆ బ్రాహ్మణుడు ఏడు తరాల వరకు సంతానం కలగకుండా వంశాభివృద్ధి నిలచిపోవుగాక అని శాపం ఇచ్చాడు. ఆ శాప నివారణ కోసం భీంనగరలో శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి నల సోమనాద్రి శ్రీకారం చుట్టినట్లుగా చరిత్రకారులు చెప్తారు. అయితే సోమనాద్రి పాలనలో ఆలయ నిర్మాణం కాలేదు. దీంతో సంస్థానాధీశుల 6వ తరమైన భీంరెడ్డి, నాంచరమ్మ దంపతులు ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారు. ఆ స్థలంలో పెద్ద గుండు బయటపడింది. తెల్లవారేసరికి శ్రీ హయగ్రీవ స్వామి స్వయంభూవుగా దర్శనమిచ్చారు. ఆ దంపతులకు స్వామి వారు కనిపించి ఇక్కడ నేను క్షేత్ర పాలకుడుగా ఉంటాను ముందుగా నా ఆలయం నిర్మాణం జరిగిన తర్వాతే వేణుగోపాల స్వామి ఆలయాన్ని నిర్మితం చేయాలని ఆదేశించారు. దీంతో ముందుగా హయగ్రీవస్వామి వారి ఆలయ నిర్మాణం చేపట్టి నిత్యపూజలు చేశారు. అనంతరం శ్రీ సంతానవేణుగోపాల స్వామి ఆలయం నిర్మాణం చేపట్టి స్వామి వారిని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించారు.

### స్వామివారి విశిష్టత..

హయగ్రీవస్వామి వారు తెల్లటి శరీరంతో గుర్రం తల కలిగి ఉంటాడు. కుడి వేళ్లు జ్ఞాన ముద్రతో ఉండగా, ఎడమ చేతిలో జ్ఞానగ్రంథాలు ఉంటాయి. శ్రీ హయగ్రీవ స్వామిని చదువుల దేవుడిగా భక్తులు పూజిస్తారు. చదువుల తల్లికి సరస్వతికే చదువు చెప్పిన మహాగురువుగా కొలుస్తారు. మహావిష్ణువు అవతారంగా స్వామి వారిని కొలుస్తారు. జ్ఞానానికి, వివేకానికి, వాక్కుకు, బుద్ధికి, సర్వవిద్యలకు ఆదిదేవుడిగా భావిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే శ్రావణపౌర్ణమిని స్వామి వారు ఉద్భవించిన రోజుగా భావించి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ రోజు స్వామి వారిని దర్శించుకుంటే సకల విద్యలు, జ్ఞానం పొందుతారని చరిత్ర చెబుతుంది.

### తెలంగాణలో మొదటి ఆలయం..

శ్రీ హయగ్రీవ స్వామి వారు లక్ష్మీసమేతంగా స్వయంభూగా గద్వాలలో వెలిశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా కూడ స్వామి వారు స్వయంభూగా వెలసినట్లు చరిత్ర లేదు. అన్నిచోట్ల స్వామి వారి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. కేవలం గద్వాలలో మాత్రమే స్వామి వారు స్వయంభూవు వెలియడంతో ఈ ప్రాంతానికి ప్రత్యేకత సంతరించుకున్నది.


### ఆలయ అభివృద్ధి..

శ్రీసంతాన వేణుగోపాల స్వామి, హయగ్రీవస్వామి ఆలయాల అభివృద్ధికి దాదాపు 140 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మధ్యనే సంస్థాన వంశస్తులు డాక్టర్ సుహాసిని, విక్రమసింహరెడ్డి ఆలయ ధర్మకర్తలుగా నియామకమయ్యారు. వీరి సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అలాగే ఆలయాల అభివృద్ధిలో డాక్టర్ రఘునాథరెడ్డి కృషి ఎంతో ఉన్నది.



శ్రీహయగ్రీవ స్వామి ఆలయం


### ఆలయం ఎంతో విశిష్టమైనది..



శ్రీ హయగ్రీవ స్వామి ఆలయం ఎంతో విశిష్టమైంది. ఆలయ 400 సంవత్సరాల కిందట నిర్మాణం జరిగింది. స్వయంభూగా స్వామి వారు వెలిశారు. స్వామి వారు క్షేత్రపాలకుడిగా ఇక్కడ ఉంటాడు. విద్యకు ఆదిదేవుడు. శ్రీ హయగ్రీవ స్వామి స్వయంభూగా వెలసిన ఆలయం తెలంగాణలో ఎక్కడా లేదు. కేవలం గద్వాలలో మాత్రమే ఉంది. స్వామి దర్శించుకోవడంతో సకల శుభాలు కలుగుతాయి.

–రాఘవాచారి, ఆలయ పూజారి

### అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..



సంతాన వేణుగోపాలస్వామి, స్వయంభూ లక్ష్మీసమేతా హయగ్రీవ స్వామి ఉన్న ఆలయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే ఆలయానికి పూర్వవైభవం తెచ్చేలా పనులు చేపట్టాం. త్వరలో సంతాన సాఫల్య హోమాన్ని నిర్వహించనున్నాం. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరం.

–పురేందర్, ఆలయ ఈవో